# కథానంద సాగరం

వసా

## 1

**లేఖ**కురాలు కావలెను

తెలుగు దస్తూరి బాగుండాలి.

రచన నేర్చిఉంటే మరీమంచిది.

500 అయిదువందలు రూపాయలు నెల జీతం!

కశింకోట ఊరు,

ఊరు నడిరోడ్డుచివర,

శారదానది ఒడ్డున,

'నందనం'కి వచ్చి తేల్చుకోవచ్చు

అదీ ప్రకటన. అక్కడికి చేరేముందు దేనికైనా మంచిదని మరోసారి చదివింది రిక్షా ఆగింది. ట్రంకురోడ్డు దిగితే ఊళ్లోకి రస్తా.

"ఊళ్లోకి పోనీయ్! ఏటివొడ్డుకి..."

* * *

"నందనం యిదేకదండీ?" రిక్షా దిగుతూ అడిగింది. అతను అటు తిరిగి, "రండి! రండి!..." అంటూ లోపలకు దారితీశాడు.


* * *

"నేను చెప్పడం - మీరు రాయడం, అంతే!" నేను చెప్పేవి కథలు. నోటి కొచ్చినట్టల్లా జోరుగా చెప్పకుపోతూం టాను. మీరువాటిని చదవడానికి బాగుండే లాగ వ్రాయాలి. అంతా విన్నాకనూ రాయవచ్చు, యేదీ వదిలేయకుండా,... ఇహ...చెప్తున్నాను!...

'పసుపు రాసుకున్న ముఖానికి టాల్కంపౌడరు అద్దుకుంటున్న మగువ'- కశింకోట; ఊరంటే ఊరే, పల్లె అంటే పల్లెటూరే. ఆ ఊరుచివర - నందనం. వాడు నిల్చుని పల్చగా పారుతున్న యేటివంకా నీలపుకొండ దూరపు నునుపు వంకా చూస్తూ రిక్షా నడిక్కి అటు చూడగా ఆమె రిక్షాదిగుతూ 'నందనం' పేరున్న అట్టముక్క చూస్తూనే నందనం యిదే కదండీ అని అడిగింది. నందనం ఏదో అట్టహాసంగా ఉంటుందని ఊహించుకొని ఉండొచ్చు, కాని, మొగలాయిలనాటి ఒకపాత డాబాఇల్లు, చుట్టూరా అరటి వనం, మందారచెట్లూ మల్లెపందిరీ యింటి మొగసాల అరణ్యంలా పెరిగి విరగ బూచిన ముద్దబంతి చెట్లూ, గేటు అనుకో వలసిన వెదుళ్ళకట్టూ చూసి సందేహంలో పడి ఉంటుంది.

వాడి పేరామెకి ఆమె పేరు వాడికి అవసరం లేకుండానే వచ్చినపని కొంత తేలింది..."

"ఔను మీ పేరు నాకు తెలీదు,"... అందామె. ఆమె మాటలతను వింటూనే



కెరటంమీద కెరటం విరుచుకుంటున్నట్లు, "వాడు తనపేరు చెప్పాలనుకుంటూనే చెప్పలేదు. వీడిపేరు ఏదైతే నాకేం అనుకుంటూండవచ్చు...."

"లేదు, చెప్పండి!"

"మీ ఇష్టంవొచ్చిన పేరెట్టవచ్చు, ఎలాపిల్చినా పలుకుతాను!"

"......'సాగరం' - అంటాను!" అందామె.

"'సాగరం' - సాగరం... బాగా



ఉంది... 'కథానందసాగరం'... అదీ బాగుంటుంది! ఈ చిన్న సైజు టేబిల్ టాప్ భూలోక నందన దేవతావనం నందనం కొద్దిరోజుల్లో 'కథానందనం' నిలయంగా మారబోతోంది కథానందనం ముద్రతో కేవలం కథలతో ప్రచురణలు వెలువడతాయి. కట్టాడు, కొట్టాడు, తెచ్చాడు లాంటి ఆ కథల్ని పెంచి నవలలు పండించుకోవచ్చు. పొదిగించి సినిమా కథలు చేసుకోవచ్చు. చిలుకు దిద్ది సింహాచలం శిల్పంలాంటి కథలు కథానికలుగా మార్చుకోవచ్చు. వినోదం వ్యంగ్యం ఒకటేమిటి నవరసాలూ విత్తనాల గింజలుగా ఉంటాయి. పిల్లల్చేయించని గ్రుడ్లు; ఆకారం చెక్కని శిల్పాలు; అంతే సరుకుకోసం వెతుకుతున్న వాళ్లకి ముడిసరుకు సప్లయి చేస్తాయన్న మాట. అన్ని హక్కులూ అందరికోసం వదులుకో

బడినవన్నమాట. పెద్ద పెద్దవాటిని కుదించి 'సంక్షిప్తం' అంటున్నారే అలాంటివీ ఆ పుస్తకాల కథలుగా రావచ్చు. ఇటువంటి ప్రయత్నం-యితర భాషలసంగతి నాకు తెలీదుగాని – మన తెలుగులో మట్టుకు ఇదే మొదలు...కాలం కలిసొస్తే..., అప్పుడు వాడు తన పేరు 'కథానందం' అని వేసుకోవాలనుకున్నాడు. ఇప్పు డిపుడే 'కదానందసాగరం' అని కొంచెం కలుపుకున్నాడు, అంతవరకు వాడిప్పటికి తనపేరు 'సాగరం' అని తగ్గించుకుంటు న్నాడు. ఇక్కడ్నించీ వాడి పేరు సాగరం...

...సాగరం అసలుపేరు ఆనంద మూర్తిలో మూర్తి ఊడిపోయి తోకతెగిన నక్కలాగ ఆనందం అనిపించుకుంటూ ఇప్పుడిపుడే సాగరంగా అవతారం మార్చింది..."

"మీ పేరు ఆనందం అన్నమాట!"

"కాదు-'సాగరం'-భూత భవిష్యత్ పేర్లన్నీ వాడు మర్చిపోతూన్నాడు, ఇహనించి వాడి పేరు సాగరం మీరేదో కొంచెం రాసినట్టుందిలా యివ్వండి..."

ఆమె ఇబ్బంది చూస్తూ అతను నవ్వుతూ, "ఆరంభంలోనే కొంచెం తికమక పడ్డారు – కళింకోట ఊళ్లోని మగువ అనే ఆమె పసుపు రాసుకొని పౌడరు అద్దుకుంటుంది – అని వ్రాశారు; ఊళ్లో సరికొత్త తీరులు ప్రవేశిస్తూన్నా యన్న విషయాన్ని అలాగ చెప్పాను, మీరేకవిత్వాలూ కావ్యాలంకారాలు తెలిసిన వారై ఉంటే ఊర్నీ మగువ అన్నానని పసుపు పాతకూ, పౌడరు కొత్తకూ గుర్తులుగా వాడానని అర్థంచేసుకుని రాసుండే వారు,...'వాడు' 'వాడికి' అని చెప్పింది చెప్పినట్టుగానే వాడు వాడికి అనే వ్రాశారు గాని, పాపం వాడిమీద కనికరించి అయినా, మీరే ఏ రచయిత్రో, కథకురాలో కనీసం కథలూ అవీ చదివి చదివి వంటబట్టించుకున్నవారై ఉంటే – ఒక యువకుడు అనో, ఒకాయన, అందగాడు కాకపోయినా కురూపికాని ముప్పైయేళ్ళ లోపు వ్యక్తి అనో రాసుండేవారు-ఫరవా లేదులెండి, మీరే అద్భుతంగా రాసే కాలం ముందుముందుంది!...కవితలూ, గేయాలు, మాటల గారడీలు, సాహిత్యం సర్కస్‌లూ ఇప్పుడు అనవసరం అని నమ్మేవాడిని నేను! తెలుగు చదవగల మామ్మూలు ప్రతీవారికీ ఎంత గొప్ప విషయాన్నైనా తేలికగా బోధపడేలా చెప్పగల వచనం ఒక్కటే చివరవరకూ అవసరం అని నాకు గట్టినమ్మకం.– లేకుంటే నేనే ఒక గేయరచయితనైతే మీ చేత వ్రాయించి అలాగే బ్లాకులు చేయించి అచ్చువేయాలన్నట్లుగా ఉంది మీ దస్తూరి," అంటూ ఆగాడు.

"ప్రకటనలో ఉన్నవాటిల్లో అదొక్కటే నాకున్న అర్హత...," తనలో తానను కున్నట్లుగా అందామె.

అతను పది కాగితాలు బల్లమీద పెట్టి



"అడ్వాన్సుగా నెలజీతం, మరో ఐదు ధరావత్తుగా - ఉంచండి," అన్నాడు. ఆమె మరేమీ అనకుండా తీసి సంచిలో పెట్టుకుంది, "ఇది రెండో అర్హత," అని గట్టిగానే అంది.

"నా వాలకం అదీచూసి, వీడేం అయిదొందలు జీతం యిస్తాడు ?! అని అనుకున్నారేమో, కాని నన్ను నమ్మవచ్చు తర్వాతర్వాతెలుస్తుంది, యెందుకు నమ్మొచ్చో...మిమ్మల్ని పూర్తిగా నమ్ముతున్నాను, మీకు వీలున్నప్పుడల్లా రావచ్చు (రాయొచ్చు) వింటూండొచ్చు- అన్నట్టు... మరిచాను...," అంటూ అతను లోపలికెళ్ళి తీసుకొచ్చాడు, వెండి

గళాసుల్తో శారదానది చలాలనీళ్లూ, వెండి గిన్నెల్లో తినుబండారాల్నీ, వెండి మర చెంబునిండా కాఫీకూడా.

"ఇవి పెరుగ్గారెలు-మాఅవ్వతయారీ. ఈ ఇల్లు మా అవ్వ దే. యీ ఊళ్లో యింకొన్ని ఉన్నాయి. మంచి ఆస్తేఉంది. భూమీ అవీ-నేను ఏకైక వారసుణ్ణి;... అవి జంతికలు! 'బల్ల' అనే యంత్రం నుండి వచ్చింది కాబట్టి 'యంత్రిక'— 'జంత్రిక' అన్న సంస్కృతశబ్దం జంతిక అయిందంటారు. ఈ గ్రామం జంతికలకు పెట్టింది పేరు. యంత్రాల్లాగ ఆడవాళ్లు పిసుగూ విరామం లేకుండా ఆవిర్లుగక్కే-నూనెపెనాలముందు ప్రకృతి పురుష ల్లాంటి 'బల్ల' 'గుడబ'లతో దుంపలపిండి ముద్దలు జంతికలు తిప్పుతూనే ఉంటారు. కర్రపెండలం మొదలైన దుంపజాతిని ఎండబెట్టి మిల్లాడిన పిండి ఎమ్మోనియా ఎరువుతో కలగలిపి పంటలకు జల్లేందుకు పుట్టింది మొదట. దాన్ని కిమ్మత్తుగా ఉందని మినప్పిండితో బియ్యప్పిండికి బదులు కలిపి జంతికల పరిశ్రమకు ముఖ్యాధారంగా చేసుకున్నారు-అటువంటి దుంపల పిండిలో ఉన్న ఘనమైన ఆహారపు విలువలు గుర్తింపబడి ఇప్పుడు ఘనమైన ప్రజారాజ్యంలో రేషన్లు గా యిస్తున్నవాటిలో ఒకటిగా చేర్చబడి అందజేయబడుతూన్నది. అటువంటి ఘన మైన పిండితో తయారైన జంతికలు యివి! మీరు తింటారని కాదు, యీ గ్రామం ప్రత్యేకతలు మీకు తెలిసి ఉండడంకూడా మంచిదేగదా అని పెట్టాను. ఇంతకంటే మంచి టిఫిన్లు యీ ఊళ్లో దుర్లభం. ఇలాంటి ఆతిథ్యం మీరెప్పుడూ చూడలేదు, చూడబోరు, మరచిపోలేరనికూడ అంటాను..."

ఆమె ఆ రెండూ ఉన్నది. జంతిక ఒక్కటే తినగల్గింది. తర్వాత ఇద్దరూ కాఫీలు త్రాగారు.

"మీరు యిక్కడికివచ్చి ఉంటానంటే యీ ఊళ్ళోనే మంచిఇల్లుచూసిఉంచాను. మీకు సదుపాయాలన్నీ ఉంటవి అద్దె లేదు. అక్కర్లేకపోతే చెప్పెయ్యండి- యిప్పుడు కాదు-తర్వాత...తర్వాత... మీరు నన్ను మరొకలాగకూడ అనుమా నిస్తూండవచ్చు - అటువంటి అనుమానం వద్దేవద్దు!-, ఇంతకూ మీరు నాకు- ప్రవాహం కనబడకుండా నిండుగా ఉన్న గోదావరి — లాగ కనిపిస్తున్నారంతే!, అంతే!..."

"గోదావరి!!!...నా పేరు మీకెలాగ తెల్సు?!" అందామె ఆశ్చర్యంగా కళ్ళన్ని తెరిపార చూస్తూ

"మీ పేరు 'గోదావరి' అని నాకు తెలీదు-కాని-తెలిసిపోయింది!" అన్నాడు.

ఆమె తలవంచుకుని పేడ అలికిన నేల, నేలమీద బియ్యప్పిండి ముగ్గు, ముగ్గు రవ్వ కరుచుకుపోతూన్న చీమను చూస్తూంది...

ఆమె వెళ్ళింది.

* * *



## 2

రెండ్రోజుల తర్వాత గోదావరి వచ్చింది.

"మీ ఊరికి వెళ్లి వచ్చారు గదూ?..."

ఔనన్నట్లు చూసి గోదావరి, "కథ చెప్తారా?" అన్నది.

"చెప్తాను, మెల్ల మెల్లగా తాపీగా చెప్తాను. నే చెప్తుంటే మీరెలాగ రాస్తారో చూడాలి గదా మరి..."

"అలాగే..."

"చెప్తున్నాను - రాయండి ...యిదే తొలిపూజ గదూ...;

...'అది కైలాసం. పార్వతీ పర

మేశ్వరుల నిలయం. అమ్మగారు ఇంటికి రాదు. అయ్యగారెక్కడికో వేంచేశారు. వంట కుమారస్వామి నెత్తిన బడింది. ఎగవేసే మార్గం ఆలోచిస్తూండగా— విఘ్నదేవర బొజ్జ మోసుకుంటూ దిగ బడ్డాడు. స్కంధుడు విఘ్నవినాయ కుడికా బాధ్యత అప్పగించి నెమలి యెక్కి తుర్రుమని జారుకున్నాడు.

వండి పెడితే తినడం ఒక్కటీ తెలిసిన గణపయ్య ఈ కూరా ఆ కాయా ఉల్లీ గిల్లీ రొడ్డ గడ్డా పప్పుతో సహా అన్నిటినీ ఉడకేసి బండెడు చింతపండూ కొండంత ఇంగువా బ్రహ్మాండమైన కారము ఉప్పూ బెల్లమూ మిరియం ఒకటేమిటి వంటింటి సమస్తమూ అందులో గుమ్మరించి జారుజారుగా ఉన్న ఒకే ఒకవంటకాన్ని దించి ఉస్సు రంటూ తొండంతో చెమట తుడుచుకున్నాడు.

హాలాహలాన్ని మింగగా పుట్టు కొచ్చిన బ్రహ్మాండమైన ఆకలితో ఆవురావు రంటూ అప్పుడే వచ్చిన సాంబమూర్తి ఇల్లంతా ఇంగువ వాసనలు గుబాళిస్తున్న, దాన్ని జుర్రి ఆ రుచికి, ఆ సరి కొత్తవంట కళకూ అహా! అంటూ ఉబ్బి తబ్బిబ్బై ఉబ్బులింగడయ్యాడు. నారదుడూ అప్పుడే దిగాడు.

మురుగడు 'పార్వతి' మన వినాయ కుడు, నారదుడితో సహా అంతా ఊడ్చుకుతిన్నాక, "ఇప్పాకరత్నంబు పేరెన్న?" అని కలహభోజనుడు చర్చ లేవదీశాడు.

"ఇమ్మహా వంటకాన్ని చేసింది నేను!", అన్నాడు వినాయక పుళ్లైయారు సగర్వంగా తొండం బిగించి పైకెత్తి.

"పురమాయించింది నేనై ఉంటిని గదా!" అంటూ వేలాయుధంతో నేల గుద్ది ముందుకొచ్చాడు వేలు.

అప్పుడు జగన్మాత, "ఇటువంటి ఘన దివ్యపాకానికి ఏదో పేరు పెట్ట డానికి వీల్లేదు. మొదట రుచి చూసింది సాంబశివులవారే గనక, వారికే అంకితంగా సాంబశబ్దార్థకమై-సాంబారు-అని పిలవాలి," అని ప్రతిపాదించింది. 'సాంబారు' అని ఖాయపర్చడం జరిగింది.

"ఈ పాకాన్ని సేవించితే శివసా యుజ్యం తప్పదు గాక," అని శివుడు వరం యిచ్చాడు.

"ఇయ్యది నారీలోకానికి శ్రమ తగ్గించే వెయ్యి వంటల పెట్టుగా వర్ధిల్లుతుంది. ఇంట్లో దీన్ని చేస్తే మగవారు హోటళ్లకు వెళ్లరు," అని పార్వతి,

"నన్ను ప్రధానదైవంగా ఆరాధించే ప్రజకు ఇస్సాంబారు వారి సొత్తై ప్రధాన జాతీయ పాకమై వెలయుగాత," అని ఆరుముగంస్వామి,

"ఈ ప్రతాపమంతా నాదే గనక, నా ప్రియమైన ఇడ్లీలనబడే కుడుములు దీనిలో ముంచి పరగడుపు నింపుకొంటే

ఎట్టి విఘ్నములు ఉండవు. సాంబారుతో ఉదరము పూరించితే నన్ను పూజించిన ఫలము" అని విఘ్నేశ్వరుడు వరాలు యిచ్చారు.

"ఈ కథ చెప్పినా, విన్నా, రాసినా, చదివినా నిర్విఘ్న సంకల్ప సిద్ధి, విజయం, కళ్యాణప్రాప్తి, సర్వశుభములు, శివసాన్నిధ్యం కలుగును," అంటూ మంగళం పాడుతూ ముల్లోకాలూ తిరిగాడు." -చెప్పడం ముగించి సాగరం గోదావరివంక చూశాడు. గోదావరి రాయడం పూర్తిచేస్తూఉంది. "అరె! అనుకోకుండా పాతాచారంగా తొలి కథ వినాయక పరంగా వచ్చిందే!! ఐతే కథానందసాగరం నిరాటంకంగా సాగుతుందన్నమాటే. మీరు రాయడం కూడా బాగా రాశారని చూడకుండానే చెప్పేస్తున్నాను యింకా, రాస్తారు అని కూడా. గణపతి పేరెత్తితే విఘ్నాలుండవుటగా మరి..." అంటూ సాగరం లోపలికెళ్లాడు.

## 3

"చెప్పుతున్నాను, వినండి......

సాగరం ఒక ప్రతికా దివాణంలో ముప్ఫై రూపాయలు జీతం ఎగిరి అందుకుంటూ పనిచేస్తున్నాడప్పుడు.

అక్కడ ఓ పదిమంది కూడి తలా రూపాయి వేసుకొని నెలనెలా పదిలాటరీ టిక్కట్లు కొంటూండేవారు, పాండవుల్లాగ సమానంగా పంచుకుందామని.

ఆ దశకంత సిండికేటులో సాగరం ఒకడు. మొదట్లో లక్షామత్స్యయంత్రాన్ని కొట్టేస్తున్నంత సరదాగా, ఆ పాంచాలిని పది ముక్కల్నరికి తలో పదేసి వేలూ జేబుల్లో వేసుకోబోతూన్నట్లుండేదల్లా ఏడుస్తూ రూపాయివ్వడం కాడి కొచ్చింది.

పదిమందిలో శకునిగారు ఒకడు. మూడొందల జీతగాడు. అది అతని అసలు పేరు కాదు. గిట్టనివాళ్లు పెట్టిన పేరది. పరోక్షంలో శకునిగాడు అంటుంటారు. శకునిగారూ! అని పలకరించుతూనూ ఉంటారు. జిత్తులమారి నక్క అంటే తామెంతో గొప్ప రాజకీయ చాణక్యులమై పోయినట్లుగా పొంగిపోయేవారుండరూ, అలాగ శకుని అనిపించుకోవడం అతనికి సరదాగానే ఉండేది. తక్కువ జీతగాళ్లంటే శకుని ఎందుకనో చిరచిరలాడుతుంటాడు. సాగరంమీదా, సాగరానికి తోడు నీడ లాంటి ఆఫీస్ బాయ్ బాబూరావు మీదా శకునిగారి కటాక్ష వీక్షణాలు పాపానికైనా పడేవిగావు.

తారాబలాలు, సంఖ్యాబలాల మీద గట్టినమ్మకమే గాకుండా ఆ శాస్త్రాల్లో మంచిప్రవేశం తనకు ఉందంటుంటాడు శకుని. ఒకనాడు గొప్పసంగతి బయట పెట్టాడు. అదేమిటంటే ఒకడి శని మిగతావాళ్ల శుభగ్రహాల శక్తినంతట్నీ హరించేస్తున్నది. ఒకడి సుడి తొమ్మిది


నిచ్చెన్ల మీదా పెద్ద పాములాగ మింగేస్తు న్నదిట. "ఎవరా సుడిగాడు ?" అను కున్నారు. అది తేల్చడానికే అ దరి పేర్ల సంఖ్యాబలాలు తారాబలాలు అహోరాత్రాలు గుణించి గణించి భాగిస్తూ పరిశీలిస్తున్నాడట శకుని, బాబూ రావు చెప్పాడు.

మామ్మూలుగా కొత్త రాఫిల్ టిక్కట్లు కొనడానికి సాగరం జీతం తీసుకున్న నాడే తనొంతు రూపాయి యివ్వబోతే, "అయ్యో, అప్పుడే కొన్శాం అన్నీ. నీ సంగతే మర్చిపోయావోయ్. వచ్చే తూరిద్దువుగాన్లే" అంటూ నసుగుతూ చెప్పాడు దశకంఠ సిండికేటు నిర్వా హకుడు శంకర్ ప్రసాద్ దయాళ్. సాగరానికి అర్థమైంది, మొదట చిన్న బుచ్చుకున్నాడేగాని, తర్వాత నిజమే అయి ఉంటుంది, తను నష్టజాతకుడు కాబట్టే దేశదిమ్మరిగా ఊళ్ల పట్టి ఆఫీస్ బాయ్‌కంటే తక్కువ జీతంకి నౌకరీ చేస్తున్నాడు. తన శని ఎవర్నీ అంటకూ వదు. అంటనియ్యదం తన తప్పే...అను కున్నాడు. అలా అనుకుంటూనే రూపాయి చేత్తో పట్టుకునే అలా నడుస్తూన్నాడు. రూపాయి టిక్కెట్ తొంభై పైసాలే ! అంటూ అరవలేక అరుస్తున్న పదేళ్ల మ్మాయి కిరసనాయిలు దీపంబుడ్డీ వెలుగులో లాటరీ టిక్కట్టు దొంతులు పేవ్‌మెంటు సిమెంటు రాయిమీద పర్చు చుకుని, ఒక్కరైనా కొనరా ? అన్నట్టు ఇటటూ చూస్తూ కనిపించింది. ఆ అమ్మి మొగాన్ని చూసో స్వరాన్ని వినో సాగరం రూపాయి కాయితం అలాగే పడేశాడు. ఆ అమ్మాయే టిక్కట్టొకటి చేతిలో పెట్టింది. నిర్లక్ష్యంగా దాన్ని జేబులో కుక్కేశాడు. "పదిపైసలు యిందండీ"... వినిపించుకోకుండానే నడిచిపోయాడు.

*  *  *

డ్రా తేదీ మర్నాడు పత్రికానిలయం సందడిగా ఉంది. శలవుపెట్టి, మరి అవసరంలేక ఊరికే ఉండలేక సాగరం వచ్చేశాడు కొంచెం ఆలస్యంగా. లక్షా వచ్చేసి ఉంటుందనుకున్నాడు వాళ్లకి. కాని శకుని మాటలు మరోలా విన వచ్చాయి. "చూశారా ! నే చెప్పలేదూ, శాస్త్రిలూరిక పుట్టలేదు—ఈ వందా వెనుకరాబోతూన్న బంపరు విమానానికి దారిచూపే పైలట్ విమానం అన్నమాట."

తొమ్మిది టిక్కెట్లలో ఓదానికి నూరు రూపాయలు పేలాయిట, పేపర్లో ముఖంపెట్టి చూస్తూన్న బాబూరావు చెప్పాడు నిజమే, మొమ్మాటికీ తను శనిగాడే. మొదట్నించీ తను లేకుండా ఉంటే పాపం వాళ్ళకి యిప్పుడొచ్చిన వందకుబదులు లక్షా వచ్చేసి ఉండేది. సుడిగాడివగ్గిర టిక్కట్టెందుకు? సాగరం జేబులో నోట్‌బుక్ తీసి గట్టిగా దులిపాడు. దాన్ని చించేద్దామనో పారే



ద్దామనో. ఆ దులుపుకి నోట్ బుక్‌లోంచి జారిన టికెక్కట్టు బాబూరావు దగ్గిరికెళ్ళి పడింది. బాబూరావు దాన్ని చూశాడు. (మళ్ళీ పేపర్లోచూశాడు. పాము కాటేసిన వాడిలా కేకపెట్టి, గబ గబా ఆ టికెక్కట్టు సాగరం జేబులోకుక్కి సాగరాన్ని నెట్టుకుంటూ, వెళ్ళిపో సాగరం, వెళ్ళిపో. చప్పున ఇక్కడ్నించి వెళ్ళిపో..." అంటూ బైటకుపంపేసి పరుగెత్తు కుంటూ లోపలికెళ్ళి పెద్ద కేకలు పెడు తున్నాడు. "సాగరానికి లక్ష, మన సాగరానికి లక్ష..." అంటూ వినిపిస్తు న్నాయి తిరిగివెళ్ళిపోతూన్న సాగ రానికి...

*   *   *

ఆ తర్వాత తంతు నెమ్మదిగా పూర్త యింది. ఇల్లుకట్టుకోడానికి బాబూరావుకి ఐదువేలు యిచ్చాడు, సాగరం. టిక్కట్టు చేతిలోపెట్టిన అమ్మాయికి ఎంతైనా యిద్దామనుకున్నాడు, దొరక లేదు.

మిగతావాళ్ళు శకునిని నిలదీసి అడి గితే, "అదే శనిగాడి మహాత్యం; నలు గురుతో కలిస్తే శని, ఒక్కడూ విడి పోతే బంగారం ఖని! ఎత్తేస్తాడు, అని సమర్ధించుకున్నాడట. పదేసి వేలూ పడ గొట్టాడన్నట్లుగా శకున్ని ఇప్పటికీ కొర కొరా చూస్తూనే ఉంటారటవాళ్ళు. బాబూరావే రాశాడు.

సాగరం కాక మరొకడైతే శకుని ఫోటో పెద్దది పటంకట్టించి రోజూదానికి దణ్ణంపెట్టుకొనేవాడే.

* * *

ఆకలి లేనివాడిముందు ఉండాతో అండాడు ప్రసాదం పెట్టినట్టుంది. సాగ రానికి పెద్ద సంతోషం కలగలేదు సరి గదా, ఎంతోమంది జేబులు కొట్టిన పక్కాదొంగలాగ ఊళ్ళోతిరగలేనంతగా సిగ్గుపడిపోయాడు.


కొంతమంది చేరి సిన్మా తీస్తున్నాం! వాటా చేరమన్నారు. ఇప్పుడిప్పుడే రేఖ పుటకరిస్తున్నది. యింకా పొడుగెదు గుడ్డి. జాక్‌పాట్ గుర్రప్పందేలమీదా విరుచుకు పడమన్నాడొక సాముద్రి కుడు. ఇంకా యింకా చాలామంది చాలా చాలా చెప్పారు గాని, బాబూ రావు చెప్పిందే నచ్చింది. ముందు అవ్వ దగ్గిరి కెళ్ళమన్నాడు. అవ్వ కశిం కోటలో ఉంది. ఉందో లేదో...దారి లోనే గోదావరి ఉంది. గోదావరి అంటే సాగరానికి మనసు పులకరిస్తుంది. కొన్నాళ్లా ప్రాంతాల్లో గడిపాడు. సాగ రానికి ఉత్సాహంపుట్టింది.

సాదా మూడో తరగతి పెట్టె ఎక్కాడు. మామ్మూలు రకరకాల మను షులు, వాళ్ళ మధ్య ప్రయాణమంటే సాగరానికి చాలా యిష్టం."

## 4

"చెప్తున్నాను, వినండి......

సాగరం పనిచేసిన పత్రికా కద నంలో ఒక మహానుభావుడున్నాడు. ఆయన పెట్టినకలం తియ్యకుండా రోజుకి పదికథలు వ్రాసేవాడు. ఒక్క కొట్టివేతగాని, హంసపాదుగాని ఉండేది గాదు. వెతికిన పొల్లుమాట కనిపించది గాదు, అంతటి మేధావి ఆయన. ఆయనకథల్ని సాగరం చదువుతూండే వాడు. కథలు రాస్తే ఇలాగే రాయాలి అనిపించేవి. పులినిచూచి నక్కకు వాతలు పెట్టుకోవా లనిపించినట్లుగా సాగరానికి కథలు రాయాలనే కోరిక బలంగా పట్టుకుంది. అంతేగాకుండా తలలో ఎన్నోకథలు పుట్టుకొస్తుండేవి. కథల్లాంటి కలలొస్తుండేవి. సినిమాలు చూస్తున్నపుడు, యీ కథనే మరికొంత



బాగుచేసి ఇంకా బాగా రక్తికట్టించొచ్చునే అనిపిస్తుండేది. ఇంతకంటే మంచికథలు స్వతంత్రంగా ఊహించి వ్రాయవచ్చు. అలా రాసినవీ ఉన్నాయి, రాసేవారూ ఉన్నారనుకుంటుండేవాడు. తన ఊహలో ఏదోకథ వస్తే ఎవరికో చెప్పేవాడు. వాళ్ళు చాలాబాగుంటుందోయ్! రాయవోయ్! అనేవాళ్ళు; ఉత్సాహంతో రాయబోయేవాడు. రాత సాగేదికాదు, రాసింది యింకా బాగారాయాలనిపించేది. కాగితాలు పాడయేవి. సగం సగంరాసి దస్తాలు దస్తాలు పాడుచేసేవాడు. రాత వాడికి అబ్బలేదు. తన్నుతాను తిట్టుకొనేవాడు. అంతే...ఇలాంటి

రోజుల్లోనే సాగరానికి డబ్బు వచ్చి పడింది.

*  *  *

ఒకసాయంత్రం గోదావరి ఒడ్డున కూర్చున్న సాగరానికి ఒక ఆలోచన వచ్చింది. డబ్బునిబట్టి ఆలోచనలు వస్తాయి కాబోలు అనుకున్నాడు.

తాను చెప్పుకుపోతూంటే రాసిపెట్టే వారెవరైనా ఉంటే ఎంతబాగుండును!! ఇదీ సాగరానికొచ్చిన ఆలోచన. ఈ ఆలోచన ఇప్పుడు మొలకెత్తడానికి ఎప్పుడో, ఏదో మూల బీజంపడి ఉంటుందనిపించింది. పెద్ద గోడలమీద డాబాలమీద మఱ్ఱి, రావిలాంటి మొక్కలేవేవో మొలుస్తుంటాయి. వాటి విత్తు అక్కడ పడటానికి ఏ పిట్టో, కాకో, గాలో ఏదో ఒకటి అయి ఉంటుంది. ఈ ఆలోచన ఎలా వచ్చిందా అని గింజుకుంటే తెలీదు, దానంతటదే ఎపుడో తెలుస్తుంది.

ఇంతకూ తన వాగుడు విని ఎవరు రాస్తారు?

ఏ ఒక్కరైనా ఉండకపోతారా?

ఎవరు రాస్తే బాగుంటుంది?

అసలు ఎవరు రాయగలరు!......


..ఈ రోజుల్లో ఆడవారు రాసినట్టుగా మొగవాళ్ళు రాయలేరేమో...ఓపిగ్గా రాయాలన్నా అందరికీ చదవడానికి యిష్టంగా ఉండాలన్నా, సంక్రాంతికి వీధి వీదంతా నింపే చుక్కల ముగ్గు పెట్టి యింకా నేల పెరిగితే ఎంత బాగుండును అని చూసేట్టుగా (రంగు రంగు దారాలతో ఎంబ్రాయిడరీచేసి జరీ బుటాలు కుట్టినట్లుగా, పసుపురాసి బొట్లుపెట్టి ద్వారాన్ని కళకళలాడించినట్టుగా, నలుసంత పిల్లల్ని పెంచి పెద్దాళ్ళను చేసినట్టూ వాళ్ళే రాయగలరు. కూర్పు ఓర్పూ, పెంపు సొంపూ వాళ్ళ సొత్తు. .........

రావిచెట్టుక్రింద బుద్ధుడికి జ్ఞానోదయ మైనట్లుగా గోదావరి చల్లటిగాలిలో సాగరానికి మంచి ఊహతట్టింది. జులాయిగా డబ్బు తగలేసేకంటే దురాశ పెంచుకునేకంటే వెడ్డదనిపించని మార్గంలో పెట్టడమే సద్వినియోగం అనిపించింది. ప్రోత్సహిస్తూపోతూన్నట్లు గోదావరి సంజతళతళలతో ప్రవహిస్తోంది.

*  *  *

సాగరం స్నేహితుడొకడు ఒక ప్రాంతీయ వారపత్రికను కూలోడ్రింకు బండిలాగ తోసుకుంటూ నడుపుతున్నాడు. వేలంనోటీసులు కోర్టు ప్రకటనలు, పొగడ్తలకి అన్నపూర్ణ హస్తాన్ని బైటికి తీసేవారి సఫోటో చరిత్రలు చిన్న చిన్న దుకాణదార్ల అడ్వర్టయిజుమెంట్లూ పత్రిక ముఖ్యాధారాలు

సాగరం సంకల్పం నెరవేరడానికి దూరంనించి ఎవరూరారు డబ్బు అవసరం అంతగా లేనివాళ్ళు కూడా రారు. ఇంతో అంతో రాత గత్తెలమని అను




కుంటున్న వాళ్ళూరారు. ఇలాంటివన్నీ ఆలోచించి ప్రకటన ఎలా ఉండాలో తనకు తోచినట్టుగా చెప్పిందే తడువుగా ఆ మిత్రుడు పెద్ద అక్షరాలతో పువ్వుల బోర్డరు కట్టించి అచ్చు కూర్పించాడు.

* * *

అవ్వ తనకున్నదంతా ఊళ్ళోని వేణుగోపాలస్వామికి రాసేయటానికి సిద్ధపడుతున్న సమయంలో మనవడు, కూతురుకొడుకు; తాతకూ తనకూ ఉత్తరగతులు చూపించేవాడు, అడ్డాల్లోవేసి ఆడించినవాణ్ణి నాటికి నేడు చూసి వేణుగోపాలస్వామి గుడివేపు తిరిగి ఒక్క దండంపెట్టి ఊరుకొంది.

* * *

సాగరం బాల్యక్రీడలన్నీ నాగావళి నది ఒడ్డున, పావంచాల మీది గట్టుదూకి నీట్లో ఈతకొడుతూ, కార్తీక సోమవారాలొస్తే రావి చెట్టు పీనెమీదకూర్చొని లేత లేత కొబ్బరి గుజ్జు తింటూ కోటీశ్వరాలయం పెద్ద గంట ఝుంకారం నేపథ్య సంగీతంగా సాగాయి. స్కూల్లో చదవక ముందునుంచీ ఆంజనేయస్వామి కోవెల్లో ఇత్తడి గుర్రం వాహనం ఎక్కి, ఏనుగు వాహనం మెళ్ళోగంట ఆడించీ, రోజూ ఆడుకోడం. తర్వాత అక్కడే కాపీలు రాస్తుండడం హోంవర్కు చేయడం, చేతి కొచ్చినట్లు తోకమాత్రం చాలా బ్రహ్మాండంగా హనుమంతుడి బొమ్మలువేయడం ఇలా గడిచింది. అంచేతేనాగావళి, శారద, గోదావరి నదులంటే సాగరానికి చెడ్డమమకారం. నదులు ఒట్టినీళ్ళు బురదే, కాని

సాగరానికి రూపుదాల్చిన దేవీ మూర్తి ల్లాగ కనిపిస్తూంటారు తలపు కొచ్చినప్పుడల్లా...సాగరానికి వయసు వస్తున్నప్పట్నుంచి పాతికేళ్ళవరకు నడిచినకాలం పీడకలలాంటిది. అది జ్ఞాపకం రాకుండా ఉండటానికే ప్రయత్నిస్తూంటాడు. తల్లీ దండ్రీపోయాక అవ్వదగ్గిరి కే పోదామని బయలుదేరి ఊళ్ళు పట్టి పోయాడు.

మళ్లీ ఇన్నాళ్లకి అవ్వ ఇంటికి చేరుకొని ఏంచేసినా కాదననీ, ఎంత ఖర్చు చేస్తున్నా వొద్దన్ననీ హామీ యిచ్చిన మీదట, 'నందనం' తగిలించాడు.

*　*　*

తన ప్రకటన వచ్చాక నాలిక్కరుచుకున్నాడు.

పిచ్చి ప్రకటన చూసి ఎవరు వస్తారు? ...రాకపోతే పోన్లే...అని ఊరుకొని మళ్లీ—వస్తే ఏ మధ్యవయస్కురాలో వస్తుంది—అనుకున్నాడేగాని గోదావరమ్మ అనే...కాదు గోదావరి అనే ఇరవైలోపు చిన్నది వచ్చిపడుతుందని అనుకోలేదు. లాటరీ వస్తుందనుకున్నాడా? అనుకోలేదు, రావాలనీ కోరలేదు. వీపుమీద గుద్దింది!

అదృష్టం కొందరి వీపుమీద గుద్దుతుంది. కొందరికి నెత్తిమీద పడుతుంది కాకి రెట్టలాగ. కొందరికి పాతాళంనుంచి గంగ చిమ్ముకొచ్చినట్లు పాదాలకు గుచ్చుకొని మరికదల్నీదు. కొందరికి ఎదురుగా ఢీ కొడుతుంది!

ఆమెమాత్రం ఎదురుగా వచ్చినట్టని పించుతోంది సాగరానికి....", చెప్పుకుపోతూన్న సాగరానికి ఆమె ఉలిక్కిపడ్డట్టు చూడ్డం అతను గమనించలేదు, "ఇక్కడ్నించి అసలు కథ ప్రారంభం అవుతుంది, 'అసలు కథ' అని మకుటం రాయండి!" అంటూ ఆపి అటు చూశాడు. గోదావరి తలదించేసుకుని ఆదోలా యిదవూతూన్నట్లు కనిపించింది.

"క్షమించండి, మీరేదో నొచ్చుకుంటున్నట్టుంది, నేను మొదటే చెప్పానుగా, నా నోటి కెలాగ వస్తే అలా......"

"చెప్పండి... 'అసలు కథ'?" అంటూ గోదావరి ముఖం ఎత్తింది, అతని ముఖాన్ని పరీక్షగా చూస్తూ.

"లేదు-ఇహ చెప్పేది లేదు, ఇప్పుడు మరేం చెప్పలేను, ఇప్పటికిది 'సశేషం'. అసలుకథ రేపు చెప్తాను," అంటూ సాగరం లేచి వీధిలోకెళ్లి,... ఏయ్ రిక్షా! ఇలారా...అంటూ కేకవేస్తున్నాడు. గోదావరి ముఖం కలక తీరినట్టుంది.

రిక్షా గోదావరి కోసమే...

(సశేషం)

## 5

పదిరోజుల తర్వాత గోదావరి వచ్చింది.

"'అసలుకథ' ప్రారంభించండి..."

"అసలు కథా ?..." ఎటోచూస్తున్న సాగరం చూశాడు, గోదావరి ముఖం నిండుకడవలాగుంది.

అసలు కథ యిప్పడే చెప్పలేను. ఈ వాళ చెప్పలేను, కాదు, అసలుకథ ఎలా పూర్తవుతుందో నాకే తట్టడంలేదు. ఎప్పుడు పూర్తిఅవుతుందో ఇప్పుడు చెప్పలేను. యీవాళ శింకేం చెప్పను..." అంటూ తనలో తాననుకుంటున్నట్లుగా అన్నాడు.

"ఐతే...... మీరు చెప్పని కథ ఒకటి రాసుకొచ్చాను. ఇవాళ దాన్ని చదుకోవడం మీవంతు."

"మీరే ! – కథ రాసుకొచ్చారా ? చూశారా చూశారా ! నేన్చెప్పలేదూ, మీరు రాస్తారని. అప్పుడే మీరు కథకు రాలు అవుతూన్నారన్నమాట......,"

ఉత్సాహంగా అతనంటున్నది వినవట్టే గోదావరి కాగితాలు బల్లమీద పెట్టింది.

"ఉహు నేను చదవను. మీ ఆడ వాళ్ల రాసినవి నాకు మాత్రం విసుగు అందరికీ ఎంతో బాగుంటున్నా యి నిజం. మాటకు పదిమాటలు పెంచి ఎంతో వయ్యారంగా నాజూగ్గా-చప్పన విషయం పూర్తికానీకుండా ముస్తాబు చేసుకుంటూన్నట్లుంటాయి. పది పేజీల్లో చెప్పేది అరపేజీలో ఉంటేనే తప్ప నేను చదవలేను. అందరూ నాలాంటి పాఠకులే ఉంటే ఇప్పుడు నడుస్తూన్న పత్రికలు, వారపత్రికలు........."

"క్షమించండి. అంతతో ఆగండి... నేనేం విసుగుపుట్టిద్దామని రాసుకురాలే దనుకుంటున్నాను-దయచేసి చదవండి."

"మీరే చదవండి ! వింటాను, వినడం యీవాళ నావంతు."

"తర్వాత తాపీగా చదువుకోవచ్చు గదా..."

"ఇప్పుడే వినాలి !..."

"చదవక తప్పదా ?"

"వినిపించటం మీకు యిష్టంలేక పోతే మానెయ్యండి..."

గోదావరి చదవడం మొదలెట్టింది.

'నాయనమ్మ పేరు పెట్టారు గోదావరమ్మ అని. తర్వాత గోదావరి అనే పిల్చారు. తన పేరు తనకెంతో ముచ్చట గోదావరికి. తెలుగుపిల్లకు తెలుగునేల పులకరించే నది పేరు ఇదొక్కటే చెప్పుకోదగ్గ అదృష్టం తనకి.

అమ్మని నాన్న లేవదీసుకొచ్చాడని విన్నది. లేచివచ్చిందనీ విన్నది అమ్మా నాన్నా పెళ్ళిచేసుకున్నారో లేదో, చేసుకుంటే ఎలాంటి పెళ్ళిచేసుకొన్నారో తెలీదు. ఇద్దరూ చాలా మంచివారు. కాబట్టే వాళ్ళు లేరు. మీలాంటి వాళ్ళకిక్కడ జాగాలేదు పోండి అని యీ లోకం అంది

అమ్మ చివరి దశలో మేనమామ వచ్చాడు. అమ్మ తమ్ముడట. తీసుకొచ్చాడు. మేనమామ ఇంట్లోనే వయసు వచ్చింది. మంచీ చెడ్డా తెలుసుకోవడమూ వచ్చింది.

అత్తమెడలోఉన్న గొలుసూ నెక్లెసూ అమ్మ మెడలో ఉండడం తనకు బాగా తెలుసు. నాన్న పెట్టినవే. అత్తను అక్కా అని పిలవమంటూండేవాడు మేనమామ. అత్త అలా పిలవనివ్వలేదు.

అత్త బుజ్జిగాణ్ని ప్రసవించినప్పట్నించీ గోదావరి చేతుల్లోనే పెరిగాడు వాడంటే గోదావరికి పంచప్రాణాలు.

* * *

తనేదైనా పనిచేసి సంపాదించాలనే పరిస్థితులు కనిపించాయి. పెద్ద చదువు లేదు. చేతిపనులు రావు. పాటరాదు. పెదాలమీద చిరునవ్వు కనిపించే పాపాన పోదు. ఏడుపూ నవ్వూరాని ముఖం. తెల్లటిదనిపించుకోదు. అందకత్తె కాదు. బలంగా ఎదిగే శరీరతత్వం కావడం వల్లనో, ఇంటిచాకిరీ వల్లనో మోటు పల్లెటూరు గొడ్డు అనేస్తారు కూడ. ఇహ తనేంచేసి సంపాదించగలదు? ఎలాగ సంపాదించగ దు? తల తిరుగుతున్నట్లుండేది...

బుజ్జికేదో నయంకాని జబ్బు పట్టుకుంది. నయంకావాలంటే వందలు కావాలి. గోదావరి మనసు గిలగిల తన్నుకుంది. తల్లి అవాలంటే నవమాసాలు మోసి ప్రసవించనక్కర్లేదు. ఇది గోదావరికి తెలిసింది అప్పుడే.

మేనమామ పిల్లాడికి ఖర్చు పెట్టలేదు. పెట్టడు. ఋణానుబంధం రూపేణ పశుం పత్నీ సుత...అనేరకం. అత్తకు ముడుపులు కట్టడం, "అంతా వాడిదే భారం కదమ్మా? ఎక్కణ్ణించొస్తాయి? వందలు వేలూ పోస్తేమాత్రం వాడి యిది లేంది ఏం ప్రయోజనం?" అంటూ, ఆమెతో ఈమెతో అనడం మాత్రమే తెలుసు. "కాదూ మరీ..." అనడమే ఆ ఈమెకూ ఆమెకూ తెలిసింది గూడా.

ఎలాగైనా సంపాదించాలి. ఏంచేసైనా సంపాదించాలి బుజ్జిగాడికోసం అని అనుకుంటున్న సమయంలోనే గోదావరి కంటబడింది, తమాషాగా, కనీ వినీ ఎరగని ప్రకటన...

ఇవీ అవీ తెచ్చుకొనే దుకాణం కెళ్ళింది. నయాపైసాకి రెండు అగ్గిపుల్లలు విడిగాకూడా దొరుకుతాయి ఆ కొట్లో. రోజూలాగే వికారంగా నవ్వుతూ ఆ దుకాణంవాడు, "అమ్మలూ! చూశావా



మన దుకాణం పేరూ మనపేరూ అచ్చు కెక్కేసింది! పేపర్లో ఏయించేశా..." అంటూ ఆంధ్రపత్రికంతముఖం చేసుకొని ఎక్స్‌ట్రాసైజు సైజు పత్రికొకటి మడత కాగితంలాంటిది 'మహద్వాణి' యిచ్చాడు.

గోదావరి దాంట్లో చూసింది మరో ప్రకటన. అదే కనీవినీ ఎరగని ప్రకటన.

* * *

తనంటే అమిత వాత్సల్యం గల తెలుగుటీచరు బదిలీఅయి అనకాపల్లిలో ఉంది. ఆవిడ ఇంట్లోనే దిగింది. అసలు సంగతేం చెప్పలేదు. పక్కగ్రామంలో చుట్టాల్తో పనిఉందని చెప్పింది. పట్నంతో పోలిస్తే మూడుమైళ్ళకీ రిక్షావాడడిగింది కారుచవకనిపించింది. పాపం! కడుపు మంట ఏంవొచ్చినా కొంతలో కొంత అన్నట్టుంది వాళ్ళకి. కాళ్ళున్నంతవరకు తొక్కడమేగద అన్నట్టూను. ఇద్దరూ ముగ్గురూ నలుగురూ అయితే మరీ చవక. ఇరవై పైసలే...

* * *

"ఇంత డబ్బు దానికెక్కడిదీ అంటూ

అసలెలాగొచ్చిందీ అని ? ఇదెం చేసి సంపాదించి తెచ్చిందో మరి ?" - ఇవీ గోదావరికి చివరకు దక్కిన మాటా మాణిక్యమూనూ వెయ్యా వాళ్ళ కే యిచ్చేయలేదని అత్తమంట ఐదువందలే యిచ్చింది.

డాక్టరుకి అయిదువందలు యిచ్చింది. బుజ్జిగాడిని తన పిల్లాడిలాగ చూసుకుంటా నన్నాడు. వయసుమళ్ళినవాడేమో ధర్మా నికీ దేవుడికీ భయపడే రకం. బుజ్జికేం ఫర్వాలేదు. హాయిగా ఉండడమంటే ఎలా గుంటుందో అప్పుడుతెలిసింది గోదావరికి.

డాక్టరుకి డబ్బివ్వడం మేనమామకు ఎవరో జేబు కొట్టేసినట్లుందేదేమో... "నేనీకు పరాయివాడినా ? అస్సలు నిన్నెందుకు తెచ్చానో తెలుసా ? పరాయి దేంకాదు, అక్కాచెల్లెళ్ళాగుంటారు. పనికీ, 'దానికీ' సర్దుబాటుగా అని... అలాం టప్పుడు ఇదా నువ్వు చేసింది ? మీ అమ్మకు తగ్గ కూతురనిపించుకున్నావు- అది రెండాకు లెక్కువ చదివితే నువు నాలుగు..." అంటూ ఎవరూలేంది చూసి దగ్గరగా రాబోయాడు. చెయ్యిచేసుకుంటా డనుకుంది - కాని నవ్వాడు... చదువు తూన్న గోదావరి గొంతు బొంగురు పోయింది. చదవలేకపోతోంది

సాగరం తెప్పరిల్లి ఆమెవంక అయో మయంగా చూశాడు. గోదావరి సంభా ళించుకొని మళ్ళీ చదవసాగింది...

"...అక్కడ్నించి పారిపోయింది... గోదావరి దురదృష్టవంతురాలు-అంతె ! ఇహ గోదావరి అక్కడకు వెళ్ళలేదు- వెళ్ళదు! బుజ్జిగాడికోసం ఎటువంటి దేవుళ్ళనైనా నమ్ముతుంది. వాడికోసం మొక్కుతుంది - డాక్టరుకూడా అన్నాడు 'వాడికేం ఫర్వాలేదని !' కథ వినిపిం చడం అయిపోయింది

* * *

## 6

సాగరం చెప్పిన ఇంట్లో గోదావరి ఉంటున్నది. రోజూ నందనంకి వస్తూంది. సాగరం ఏమీ చెప్పడంలేదు. నెల అవ గానే అయిదు వందలూ బల్లమీద ఉన్నాయి. గోదావరి తీసుకోలేదు...

"బుజ్జికోసం-! బుజ్జికని డాక్టరుకి పంపొచ్చు!" అన్నాడు. తీసింది. "అసలు కథ చెప్తారా ?" అన్నది

"అదే ఆలోచిస్తూన్నాను. యింతలో పూర్తికాదు."

"పోనీ మరేదేనా చెప్పొచ్చుగా..."

"అసలు కథ మధ్యలో మరో కథ రాదు... మీరేదేనా రాసుకొచ్చుంటే వింటాను, పోనీ చదువుకుంటాసీసారి..."

గోదావరి అందుకోసమే ఎదురుచూస్తు న్నట్లుగా కాగితాలు బల్లమీదుంచింది. సాగిరం తీసి చదవడం మొదలెట్టాడు.

"గోదావరికి ఎక్కడా ఉండడానికి చోటు ఉండదేమో, తన పేరులో తప్ప... చదివి సాగరం ఉలిక్కిపడ్డాడు, తేరుకుని చదవసాగాడు - "అతను యీ విజ్ఞ

అక్కడ ఉంచాడు – వాడు రాడు, యిదే అతని దగ్గిరికి పోతాఉంటుంది."
"కొరకరాని కొయ్యలాగుందిరోయ్ !"–
"నాల్రోజులు మజా తీరాక వాడొగ్గేసే వరకే, తర్వాత సంతలో జంతికే..."

ఇవి ఎవరో చదువూ సంస్కారం లేనివాళ్ళు వయస్సుముదిరినవాళ్లూ అన్న మాటలు కావు. పెద్ద పుస్తకాలు పట్టుకుని, మంచి బట్టలు వేసుకుని విద్యావంతుల మనీ, సంస్కారవంతమైన కొత్త రక్తం మాలో ప్రవహిస్తున్నదని అనుకుంటూన్న వాళ్ళు రోడ్డుమీదా, మదుంగట్లమీద చేరి పలికే సహజమైన పలుకులు.

చదువూ సంధ్యాలేని అనాగరికుల్లాగ కనిపించే ఆడవాళ్ళు గోదావరికి బాగా నచ్చారు. వీళ్ళు చాటుమాటుల నుండి మాటలు విసరరు. మొహంమీద మొహం పెట్టి అడిగేస్తారు. నొప్పించాలని ఏదీ అడగరు. సూటిగా అడుగుతారు–"ఆరు నీకేం వౌతాడమ్మా ? మంతరసానిగా వొచ్చేరాండీ ?"

"ఇద్దరు, నేకపోతే ముగ్గురు...సెప్ప దాన్కిక్కడూ గోర్నమెం టంపితే దిగి నారు కాదా తవరు...?" యిలాగడుగు తారు, యింకా, "ఆబాబు నిన్ను పెళ్లాడే స్తాడా ?" అనికూడా.

గోదావరి ఇక్కడా ఉండలేదు... ఉండలేదు !– పూర్తయింది. తలెత్తి చూశాడు సాగరం. గోదావరి అక్కడ లేదు. అవతలకి పరుగెత్తాడు.

* * *

ముందుపోతున్న రిక్షాను వెనుకవస్తున్నది కలుసుకుని కలిసిపోయినట్టు జోరు తగ్గించుకుంది.

"ఎక్కడికి ?"—"తెలీదు ! కాదు– స్టేషనుకి."

రెండురిక్షాలు మాట్లాడుకొంటున్నాయి శారదానది వంతెనమీద. అప్పుడే రైలు వంతెనమీద రాజమండ్రి వెళ్ళే బండి జోరుగా పోతోంది.

"కథానందసాగరాన్ని ఎందులో తోసేయమంటారు ? దాని గతేమిటి. దాన్నేం చేసిపోతున్నారు ?"

"తనకుమాలిన ధర్మం లేదు - నా దారి నేను చూసుకోవద్దా ?"

"ఆ దారేదో చెప్పండి."

"ఏదారీ లేకపోతే..."

"ఆగండి ! ఆ పేరు నాకిప్పుడు భయంకరంగా కనిపిస్తున్నది. తలుచుకుంటే దేవతారుతల్లిగా కనిపించే ఆ పేరు నోరు చాచుకుని చూస్తున్న రాక్షసిలా కనిపిస్తున్నది..."ఓయ్ రిక్షా !" అంటూ రిక్షా తొక్కుతున్న వాడిని చూశాడు—

రిక్షావాళ్లకళ్లు కూడబలుక్కున్నాయి. రెండూ వెనక్కు మళ్ళాయి.

ట్రంకురోడ్డుని ఆనుకుని ఉన్న గోదావరి ఉంటున్న ఇంటివద్ద దిగారు. ఇద్దర్నీ చూసి వంటచేసి తెచ్చి నిలబడిఉన్న తలుపులమ్మ నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూస్తున్నది.

* * *

"మీరు వివాహం చేసుకొంటేనే మంచిది!"

"కావచ్చు!..."

"నా చేతనైనంత సహాయమూ చేస్తాను..."

"చేసుకుంటానే అనుకోండి. అప్పుడు కథానందసాగరం ఏమౌతుంది?"

"దెబ్బకుదెబ్బ తీర్చుకున్నారే! సరదా తీరింది గద..., ఏదో అవుతుంది... సాగరం... బంగాళాఖాత సాగరం... ఉందిగా!"

ఈసారి గోదావరి ఉలిక్కిపడింది; మళ్ళీ, "ఏం వివాహితురాలు నెలకు అయిదొందల విలువ చెయ్యదా?" అంది.

"అంతకంటే కావలసిం దేముంది? ధన్యుణ్ణి! బంగార్లా రాయండి. జీతమూ పెంచుకోండి..."

"అప్పుడు రాయలేకపోతానేమో, రాయనివ్వరేమో-"

"అలాగా?...ఏదో అప్పుడు చూసుకోవచ్చు. మీరేదేనా యిప్పటికీ నిర్ణయించుకొని ఉంటే, నేను, నా సహాయం సిద్ధంగా ఉంది. ఎవర్ని చేసుకోవాలనుకుంటున్నారో కాస్త చెబితే..."

"ఆయన చేసుకోడు-!"

"ఏం?"

"నే నతనికి బురదయేరులాగే కనిపిస్తానట..."

"నిరాశపడకండి, ప్రయత్నిద్దాం, నచ్చజెపుతా నతగాడికి..."

"ఎవరండీ అతగాడు? నేనే మిమ్మల్ని అడుగతున్నాను!"

"ఆ!! అటువంటి దేమీలేదా? ..."

"లేదు!"

"చూడమన్నారా?"

"ఏమిటి చూస్తారు?"

"మీకు నచ్చినవాణ్ణి చేసుకోవచ్చు-"

"నాకు ఎలాంటివాడు నచ్చుతాడో మీకు తెలుసన్నమాట?"

"... ... ..."

"మాట్లాడరేం.. పోనీ ఇలాంటివాళ్లని చేసుకుంటే బాగుంటుందని మీరే అంచనా వేసుకొని వెతుకుతారన్నమాట."

"ఔను..."

"అవసరం లేదు!"

"వివాహం చేసుకోరా?"

"చేసుకోనని నేనెప్పుడూ అనలేదే... చేసుకుంటాను-చేసుకుంటాను - చేసుకుంటాను! సరా?"

"ఇంత అల్లరి పెట్టగలరని ఎవరూ అనుకోలేరు మిమ్మల్ని చూసి."

"ఇప్పుడు మీరు అనుకుంటున్నారు, చాలు. నే నెలాంటి అల్లరి చేసేదాన్నో, కొమ్ములు మొలిపించుకోవాలనుకుంటున్న అబ్బాయిల్ని కోరి కయ్యానికి పిలిచి నట్లుగా ఎంత తికమకపెట్టేదాన్నో మా టీచరు దగ్గిరలోనే ఉంది అడగండి చెబుతుంది..."

"అలాగా! శబరీనది పొంగి కలుస్తు



న్నప్పుడు ఉరకలు గోదావరి అలాగే ఉంటుంద..."

"అది పచ్చి ఒండుబురద కాలం. ఇప్పుడు వరద తీసిన తర్వాత కాలం."

"నిండు గోదావరి, నింపాది కాలం— ఏకాలమైనా గోదావరి చివరికి చేరేది బంగాళాఖాతమేగా .." అంటూ పూర్తి చేశాడు సాగరం. గోదావరి అతని ముఖం లోకి పరీక్షగా చూసింది. చివరిమాట ఏదో ఉద్దేశంపెట్టుకొని అనాలని అన్న కొంటెతనం కనిపించలేదు "బంగాళా ఖాతం కూడ సముద్రమే గదూ. సము

ద్రానికే సాగరం అనీ అంటారు గదూ?" అని అడిగింది గోదావరి ఏమీ తెలీనట్టు.

"సముద్రం, సాగరం, పయోధి, ఉదధి, జలధి యింకా యింకా చాలా చాలా" అంటున్న సాగరాన్ని చూసి గోదావరి ఫక్కున నవ్వింది. ఆకాశంలో మేఘంలేకుండా ఉరుముతో పెద్ద మెరుపు మెరిసినట్టనిపించింది సాగరానికి. ఆమె నవ్వడం చూడ్డం అదే తొలిసారి గోదావరి నవ్వి తక్కున సిగ్గుపడుతూ తల వాల్చేసుకుని తల ఎత్తకుండానే గాలితో మాట్లాడుతున్నట్లు మెల్లగా, "అప్పుడు 'సాగరం' అంటాను అని, ఆ పేరే ఎందుకంటున్నానో నాకు తెలీకుండా నే అన్నాను మీ ధోరణి సముద్రం కెరటాల్నే ఎందుకు స్ఫురింపజేసిందో అప్పుడు ఆలోచించలేదు అప్పటికింకా నా పేరు గోదావరి అని మీకు తెలీదని నాకు తెలుసు. నా పేరు గోదావరి అని నాకు తెలిసే మీకా పేరెందుకు పెట్టానో ఆలోచిస్తూంటే కొంచెం కొంచెం ముడి విడుతున్నది. తర్వాత నన్ను 'మీరు' అంటున్నప్పుడల్లా అదోకలా ఉండిన దెందుకోఅదీ తెలిసిపోతున్నట్లుందిప్పుడు. గోదావరి అని పిలిస్తే బాగుండుననిపించినదేమిటో. 'సాగరం' అని పేరెట్టించిందేమిటో ఆ దొంగ దొరికిపోయింది. ఇన్నాళ్ళుగా ఆ దొంగ ఎక్కడ దాగి ఉందో అదీ తెలిసిపోయింది. ఇక దాచినా దాగదు. పొరలన్నీ పోయి నిజం నాకు చిక్కింది. ."

"ఇంత చిత్రంగా మాట్లాడుతున్న మీరు అప్పుడు, 'కళింకోట' ఊళ్ళోని మగువ అనే ఆమె...' అని దొంగెత్తుగా రాయాలనే రాశారు కదూ? నిజం చెప్పండి!" అన్నాడు సాగరం. 'ఔను' అన్నట్లు ఊరుకొంది గోదావరి.

"అంటే ఆరంభంలో నన్ను మీరే తికమకలో పెట్టేసి ఉంచారన్నమాట! ఎంత సాహసం మీది!"

"సాహసంకాదు-అవసరం. నేనేదో పెద్ద రచయిత్రిలాగో పండితురాల్లాగో మీ రభిప్రాయపడితే నాకు పనియివ్వరు. మీ ప్రకటనలో రచయిత్రి అయితే మరీ మంచిది అని లేదు - నాకు ఆ జీతం కావాలి మరి. అంచేత నాకట్టే పరిజ్ఞానం లేనట్లుగా మీ రనుకోడం మంచిదనిపించి అలా చేశాను. తెలుగు బాగా చదువుకున్నాను. రూపకాలంకారాలు ఉపమాలంకారాలు - ఉప్మా, కాఫీ అలంకారాలు కాచులెండి-లాంటివి తెలుసు. అందుకే తెలుగు టీచరమ్మగారికి నామీద చాల మక్కువ. తెలుగులో మాత్రం హైస్కూలంతటికీ బ్రహ్మాండమైన మార్కులు తెచ్చుకున్నాను. అంతే ఎందుకేనా మంచి తెలుగు బాగా చదువు అంటే మరికొంత చదివాను. యీ రోజుల్లో తెలుగు రావడం ఒక చదువులాగ పరిగణించరు నేను చదువుకొన్నదానిగానూ లెక్కలోకిరాను తెలుగువాళ్ళకి. మీ ప్రకటనలో మరీ మంచిది అన్నారేగాని, విధిగా

నేర్చిఉండాలి అనలేదు. నేనేం రచనలు చేసేంతవరకూ రాలేదు. ఏదో కొద్దిగా చదివానేగాని కథలు నవలలు కొత్తగా వస్తున్న పుస్తకాలతో నాకట్టే పరిచయము లేదు. ఇంకా నయం! రచయిత్రి కావలెననో, రచన వచ్చితీరాలనో ప్రకటించి ఉంటే ఒక నమస్కారం పెట్టేసి ఉండేదాన్ని..." —సాగరం నాగసరం వింటున్నట్లు వింటున్నాడు—గోదావరి చెప్తూనే ఉంది, "ఎలాగైనా సంపాదించాలి, ఏం చేసి సంపాదించినా తప్పు లేదు అని గోదావరి అనుకుంటున్న సమయం అది. 'మహద్వాణి'లో వింత ప్రకటన చూస్తే చిర్రెత్తుకొచ్చింది కూడ. ఇలాంటి వెధవ్వేషాలు వేస్తూన్న వాళ్ళకి బుద్ధిచెప్పినట్లూ ఉంటుంది గూడ. ఎలాగో మభ్యపర్చి, నమ్మించి కనీసం ఆ అయిదొందలైనా అడ్వాన్సుగా యిచ్చేవరకూ వదలకుండా పీక్కురావాలనుకున్నాను. ......"

సాగరం ఛాతీ చరుచుకుంటూ, "నా అంచనా సరీగ్గా పనిచేసిందన్నమాట, శెబాష్ సాగరం!!" అన్నాడు.

"ఏం లాభం? నన్ను ఇప్పుడు మీరు సరిగ్గా అంచనా వేసుకోదల్చినా కూడ జరిగే దేమిటి?...నా గురించి చాలా ఖర్చుపెట్టారు...చేయించాను! అదే బాధగా ఉంది. ఏదారీ లేనిదాన్ని-ఏదారీ లేకపోతే గోదా.......," అంటూన్న గోదావరి మాట పూర్తి కాకుండానే సాగరం చివాల్న లేచి బస్సాపినట్లుగా, "ఆపాలీ! ఆపాలీ!" అంటూ పెట్టిన కేకకి ట్రంకురోడ్డు మీద ఎలమంచిలి వెళ్తూన్న బస్సు అమాంతంగా ఆగిపోయింది.

ఇటూ అటూ చూసి ఎవరూ కనిపించకపోతే, డ్రైవరూ కండక్టరూ ఒకరి మొఖాలొకరు చూసుకుని, "ఎవడో దొంగ నాయాల! వాడి..." అంటూ తిట్టుకుంటూ బస్సు మెల్లగా విసుక్కుంటూ కదిలింది.

"ఉండండుండండి! అంతా తేలిపోతూన్నది. అసలు కథ పూర్తికావస్తూంది. నాకంతా తేలిపోయింది..." అంటున్నాడు సాగరం...

"ఎలాగ?" అంది గోదావరి.

"సాగరాన్ని గోదావరి తప్పకుండా పెళ్లి చేసుకుంటుంది-యిష్టమే..."

"అతను చేసుకోడు!.. గోదావరి నిండు బురదేరులాగే కనిపిస్తుం దతనికి-అంతే... అంచేత..."

"అంచాత గోదావరి స్టేషన్లో దిగుతుందంటారు! అంత ముచ్చటగా ఉంటే మీ రలాగ వేరేకథ-హిందీలో తీయాలని ట్రాజడీగా మార్చబడ్డ సినిమాకథలాగ-రాసుకోవచ్చు. అభ్యంతరం లేదు. నేను మాత్రం ఒక్తి తెలుగువాణ్ని. అసలు కథ ట్రాజడీ కానివ్వను! వీల్లేదు! అలా జరిగితే కథానందసాగరం సాగరం పనే ట్రాజడీ ఔతుంది. ఉందిగా

బంగాళాఖాత సాగరం... చెయ్యాలని చేసినట్లుగా ట్రాజడీ కథలు రాసే వాళ్లంటే నాకు చెడ్డ ఒళ్లమంట! అలా పనికిరాదు..." ఆలిసిపోయినట్టుగా సాగరం కొంచెంసేపూరుకొని,... "ఇక లేవండి!" అన్నాడు.

ఇద్దరూ నందనానికి బయల్దేరారు.

*   *   *

ఇద్దరూ నడుస్తున్నారు. వెనకనించి మాటలు వినిపిస్తున్నాయి దూరంగా... స్పష్టంగా...

''ఆ బావూ మంచోడే!...''

"ఆ పిల్లదీ బుద్ధిమంతురాల్లాగే ఉంది. ఏమన్నా చెక్కుచెదరదు!"

"సోమ్మవ్వ మట్టుగు తక్కువా? అంత దొడ్డదాన్ని మరి సూడం..." క్రమంగా మాటలు వినపడ్డంలేదు.

''ఇక్కడ వాళ్లు మంచిచెడ్డల మేలు కలయిక. కరుగ్గా మాట్లాడతారేగాని మెత్తవాళ్లే. డబ్బుగలవాళ్లందర్నీ మంచోళ్లంటారు, బాబ్బాబంటారు. కాని డబ్బుందని దర్పం చెలాయిస్తే మట్టుగు కరుస్తారు,'' అన్నాడు సాగరం.

''కత్తికి తేనెపూసిమాటాడ్డం, నక్క వినయాలు, నాజూకు గొంతుకోతలు వీళ్లకింకా బాగా తెలిసినట్టు లేదు..." అంది గోదావరి.

మాటల్లోనే నందనం చేరుకున్నారు.

*   *   *


"అమ్మమ్మా!" అంటూ అడుగెడుతూనే కేకపెట్టి పిల్చాడు.

"ఏరా?" అంటూ సోమవ్వ వస్తూ ఇద్దర్నీ చూసి ఏదో తెలిసినట్లు నవ్వుకుంది. ముసలితనంతో బాటు పదిమందికి చేసిపెట్టగల సత్తువా, డాబూ, దర్పంలేని నిండుదనం కనిపిస్తున్నాయి.

"నేను పెళ్లి చేసుకుంటానమ్మమ్మా!" తంతివార్తలాగ అన్నాడు సాగరం.

"ఔనా! ఇందాకే 'వాడు' చెప్పినట్టయిందిరా!" అంటూ సోమ్మవ్వ వేణుగోపాలస్వామి ఆలయంవేపు తిరిగి దణ్ణంపెట్టి, "అంతా వాడు చేస్తున్నదేరా! నా కొద్దు, వీడికే యివ్వు అంటూ రావు రావకున్న నిన్ను పంపించాడు; నా కోరిక విని నీ నోటనే మంచిమాట పలికించాడు!" అంది.

"పేరు గోదావరి—అంతకంటే నాకేం తెలీదు. కులంగిలంలాంటి ఊసెత్తితే వేణుగోపాలస్వామికే రాసేనుకో. నాకేం అఖ్ఖర్లేదు!" అంటూ సాగరం అవసరంలేని ఆవేశం తెచ్చుకుంటూంటే, "ఆగరా! తన క్కావలసిన వాళ్లనీ, కావలసిన వాటినీ కాలమే తయారుచేసుకుంటుంది. ఆ కాలం పోకిళ్లు చూడముచ్చటగా ఉంటాయికాబట్టే 'సుదర్శనం' అన్నారు. ఆ కాలచక్రం తిరగడాన్నే, అంటే తిరగడానికి అవసరమైన దాన్నే 'వాడు' అన్నారు. ఆ చక్రపాణికీ వాడి చక్రానికి తేడా లేనేలేదు తిప్పుతున్నాడని అనుకుంటాం మేం, అంతే కీలకమల్లా! మీరు కాలాన్ని నమ్ముతారు



కాలాన్ని నమ్మేవాళ్లూ, ఆ చక్రపాణిని నమ్మిన వాళ్లూ ఒకటే. తేడా ఉందను కుంటారు. అంతే! అంతా మన చేతుల్లోనే ఉంది! అంటున్న మీచేతఅనిపిస్తుండంటాం మేం. నేనేం చదూకోలేదు. అంచేత మాలాంటి వాళ్లకి వాడిమీద నమ్మకం. అదొక తృప్తి. మనస్సుకి కుదురూ, శక్తి యిస్తుంది. మీరు చదువుకున్నవాళ్లు ఆ చదువే మీకు బలం యిస్తుంది, ఏం చెయ్యాలో చెబుతూంది......" అంటూ అవ్వ కొంచెం ఆగింది.

అక్షరం రాని ఈవిడకి ఇలాంటి చదు వెలా వచ్చింది?! అని తనలో అనుకుంది గోదావరి.

అవ్వ మళ్ళీ అందుకుంది, "ఇలాంటి వన్నీ మీ తాత విడమర్చి చెబుతూండే వాడు. నేనేదో చాదస్తాలకిపోతే ఇది ఇలాగ దిగజారిపోతున్నది, అది అలాగై

పోతూంది అంటూ గాభరాపడేవాళ్ళూ, ఇదిచెయ్యాలి దాన్ని ఆపాలి అని ఊరికే మాట్లాడే వాళ్ళు. ఒట్టి పిచ్చి మొక్కలు! ఇంతకూ నువ్వు చేసిందానికీ చేసుకుంటా నన్నదానికీ చెయ్యబోయేదానికీ కాదన డానికి నేనెవర్ని గనక?...నీకూ వాడికీ తేడా లేదు—నీకు పుట్టినబుద్ధి వాడిదే, ఆ బుద్ధి వాడే..."

"ఎంత సోదె చెప్పావే అమ్మమ్మా! ...మరి ఏలాంటి పెళ్ళి చేసుకో మంటావో చెప్పు!" అన్నాడు సాగరం

"నా సోదెవినిగాదే నీ గాదె ఏం పోదులే, నీయిష్టమొచ్చినట్టు చేసుకో... ఏమే గోదావరమ్మా! నే చెప్పింది బా'పుందా!'' అంటూ వంటింట్లోకి దారి తీసిన అవ్వను గట్టిగా కావిలించుకో వాలనో, కాళ్ళు చుట్టేసుకోవాలనో అని పించింది గోదావరికి.

* * *

వెన్నెలపడుతోంది. నందనం బంతిపూలు పచ్చి పసుపురంగులో నిగ నిగలాడుతున్నాయి. సాగరం గోదావరి మాట్లాడుకొంటున్నారు.

"అదుగో, అకనిపిస్తున్న ఆలయంలో నిరాడంబరంగా జరగాలనుకుంటున్నాను ...యిష్టంలేకపోతే చెప్పొచ్చు...'' అన్నాడు.

"యిష్టమే యిప్పుడు! మీ అవ్వ మాటలు విన్నాక ఏదో తెర తొలగి నట్టుంది నాకు..."

"తెరలూ, కిలకాలతో నాకు పనిలేదు గాని, మనిషంటే నాకు చాలా యిష్టం. మనుష్యులు చేసిన దేవుళ్ళంటె యెప్పుడూ నాకు అయిష్టం లేదు! మను ష్యులు చెయ్యని దేముడంటూ ఉంటే వాడి అవసరం లేదు, యిష్టమూ లేదు. ఎప్పుడు చేసుకున్నా మనుషులు చేసిన శిల్పాలూ, కళలూ, కథలూ లాగే మంచి ఉద్దేశంతో చేసినవన్నీ నాకు మహా యిష్టం. రాను రాను వెర్రితలలు వేయడం, స్వార్థాలకు అనర్థాలకు దారితీయడం వేరే సంగతి. పరిణామంలో ప్రతిదాని గతీ అంతేనేమో.

వివాహం అంటే మేం ఇద్దరం సంసారం సాగిస్తాంఅని నలుగురికీ తెలియ జేసుకోవడమే-అంతకంటే మరేం లేదు ...నలుగుర్ని నమ్మకపోతే ముద్రగుద్దిన కాయితాన్ని నమ్ముకోవడం—... ఇలాంటి ఊళ్ళల్లో రకరకాల మనుష లందరూ చేరడానికి ఆలయం కంటే మంచి చోటు మరోటి ఉండదు. పిలిస్తే ఊరంతా వస్తుంది-యీ చుట్టు పక్కల వాళ్ళంతా మన బంధువులే, సాక్షులే...వాళ్ళకు యిష్టమైన తీరులోనే జరగనిద్దాం మనకు పోయేదేమీ లేదు. వాళ్ళనూ సంతోషపెడదాం...''

"అసలు కథ చెప్తారా యిక...?"

"పొతూందొతూంది..."

"మరొక్క టడుగుతాను..."

"ఏమిటి?"

''మరేంలేదు, లాటరీకథ నిజం కాదు గదా?"

"ఏం? నిజంగా జరిగింది కాకూడదను కుంటున్నారా మీరు"

''మీరు అనడం మానేసి గోదావరీ అనకూడదా?...అదేంటో లాటరీడబ్బు రావడం అదీ నాకదొకలాగ సమ్మించ నట్టుగా ఉంది..." ఆ మాటకు సాగరం గోదావరిని కౌగలించుకోవాలని బుద్ధిపుట్టింది...

"కథని కథలాగ తీసుకోవాలి గాని, ఇది జరిగిందా, పుక్కిటి పురాణం, పచ్చి అబద్ధం, కాశీమజిలీకల్పన, సంభవమా, అసంభవమా? అంటూ గింజుకోవడం వెర్రిపని. అది కథ ఔనా కాదా, దానివల్ల వినోదమో, నీతో, పులకరింపో కనువిప్పో కలిగిందా లేదా, అంతే కావలసింది. అందుకే కథ కంచికి మనం ఇంటికి అన్నారు... ''

"ఇంతకూ నిజం చెప్పండి."

"నేనుకథలు చెప్తాననీ మొట్టమొదటే చెప్పేను..అవ్వకు చెప్పుకోదగ్గ ఆదాయం వచ్చే ఆస్తి ఉన్నమాట నిజం... ఐతే తర్వాత, అవసరమైన దానికంటే చాలా ఎక్కువ అనిపించింది. అది ఎవరికి చెందడం న్యాయమో అలాగే కానిద్దాం- ముఖ్యమైన విషయం! వివాహో విద్యనాశాయ అన్నట్లుగా కాకుండా సాగరం చెప్పేకథలు గోదావరి వినిరాయాల్సిందే. రాయను, వినను అంటే పనికిరాదు హామీ యిప్పుడే యివ్వాలి!"

"ఇస్తున్నాను! కథానందసాగరం నిరాటంకంగా సాగుతుంది నిస్సందేహంగా...ఇప్పుడుకూడా చెప్పొచ్చు!"

"ఇప్పుడు మాటకేంగాని, ఇకముందు వచ్చేవన్నీ-, సాగరం చెప్తున్నాననడం- గోదావరి వినడం అని వేరే చెప్పనవసరం లేదు."

"పోనీ అసలు కథ చెప్పండి"

"అసలు కథ ఆలయంలో అవుతుంది. అవుతుందేమిటి, ఐనట్లే, అసలు కథ పూర్తయింది..."

"అంకితం యివ్వరూ?"

"అలాంటివేవీ లేవు."

"అసలుకథ అంకితం యిచ్చితీరాలి!"

"ఎవరికి? గోదావరికా..."

"బురవేటిక్కాదు- 'చక్రపాణి'కి," అంటూ గోదావరి అటుచూపింది. వేణుగోపాలస్వామి గోపురం ఎత్తిపట్టిన చూపుడు వేలుబాగ నిలువుగా తెల్లగా వెన్నెట్లో మల్లెమొగ్గ అనిపిస్తున్నది.

